# మంచిర్యాల ప్రశాంతతే లక్ష్యం

- ఎన్నికలప్పుడు మాత్రమే వచ్చే వారిని నమ్మవద్దు
- మంచిర్యాల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



మంచిర్యాల టౌన్ : హోటల్‌లో టీ వేడి చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు



వ్యాపారిని ఓటు అడుగుతున్న దివాకర్‌రావు, నాయకులు

మంచిర్యాలటౌన్, నవంబర్ 6: మంచిర్యాలను ప్రశాంత పట్టణంగా ఉంచడమే తన లక్ష్యమని మంచిర్యాల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. సోమవారం మంచిర్యాలలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, యూత్‌నాయకులు విజిత్‌రావు, పార్టీ నాయకులు, కౌన్సిలర్లతో కలిసి ప్రచారంలో భాగంగా రోడ్‌షో నిర్వహించారు. ఓవర్‌బ్రిడ్జి నుంచి మెయిన్‌రోడ్, ఆర్పీ రోడ్, గంగారెడ్డిరోడ్, మార్కెట్‌రోడ్, స్టేషన్‌రోడ్‌ల మీదుగా సాగింది. ఎమ్మెల్యే దివాకర్ రావు ప్రతి షాపులోకి వెళ్లి వ్యాపారులతో మాట్లాడి ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి ప్రేంసాగర్‌రావుకు ఓటు వేస్తే వ్యాపారుల భయాందోళన చెందాల్సి ఉంటుందని, అతను ఎమ్మెల్సీగా ఉన్న సమయంలోనే పోలీసులను చుట్టూ పెట్టుకుని భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు, పత్తాలాట క్లబ్‌లు, గుండాయిజం, రౌడీయిజం చేసే వారని, ఇక అలాంటి వ్యక్తి ఎమ్మెల్యేగా గెలిస్తే ఎలా ఉంటుందో మీరే ఊహించుకోవాలని కోరారు. లక్షెటిపేటలో సాంఘిక సంక్షేమ పాఠశాల భవనం స్లాబు వేయకుండానే బిల్లు రాయాలని అధికారిపై ఒత్తిడి తెచ్చారని, మాటవినని అధికారిని బదిలీ చేయించారని, భీమిని మండలం నాయికినిపేట భూముల పరిహారం సొమ్ము రైతులకు ఇవ్వకుండా ఇప్పటికీ తిప్పించుకుంటున్నారని అన్నారు. ముస్లింలకు రంజాన్ తోఫా ఇస్తానని చెప్పి ప్రభుత్వ గోదాంలోని చక్కెరను తీసుకువెళ్లిన ఘనుడు ప్రేసాగర్ రావు అని ఆరోపించారు. హాజీపూర్‌కు చెందిన హన్మంతరావుకు లక్ష్మీటాకీసు ముందు రాంచెరువును ఆనుకుని ఉన్న 1470 గజాల భూమికి రూ. 80 లక్షలు విలువ ఉండగా కేవలం రూ. 10 లక్షలు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, ఏళ్లు గడిచినా డబ్బులు ఇవ్వడం లేదన్న బెంగతో హన్మంతరావు మరణానికి కారణమయ్యారని విమర్శించారు. ఇంటిని నిర్మించిన మేస్త్రీలకు ఇప్పటికి డబ్బులు ఇవ్వ లేదని పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లా కాకుండా బెల్లంపల్లిని జిల్లా చేయాలని కోరాడని, అంతర్గాం బ్రిడ్జి వద్దంటున్నాడని, ఇక ప్రజలే ఇతని ఆలోచనలను తెలుసుకుని సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఆరేళ్లు ఎమ్మెల్సీగా ఉండి పది అడుగుల సిమెంటు రోడ్డు వేయించని పీఎస్ఆర్ ఇప్పుడు గెలిచి ఏం చేస్తాడని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా ఉండి మంచిర్యాలలో భూదాన భూమి, మార్కెట్‌యార్డు భూమి, బాలుర పాఠశాల మైదానాలను కాపాడానని పేర్కొన్నారు. ఒకవేళ అధికారంలో పీఎస్ఆర్ ఉంటే మంచిర్యాల అన్యాక్రాంతం అయ్యేదని, అలజడి సృష్టించేవారని అన్నారు. బ్యాంకులకు వందలకోట్ల రూపాయలు బకాయి ఉన్న ఆయన వాటిని తీర్చే అవకాశం లేదని, ఎంతోమంది దగ్గర అప్పులు తీసుకుని వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఇలాంటి వ్యక్తికి ఓటు వేసి ఓటు వృథా చేసుకోవద్దని కోరారు. మంచిర్యాలతో పాటు రాష్ట్రం మొత్తం అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నా మళ్లీ బీఆర్ఎస్ పార్టీనే గెలిపించాలని, అందుకే ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదెసత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ హరికృష్ణ, నాయకులు పల్లపు తిరుపతి, కొండాల్‌రావు, రవీందర్‌రావు, బొలిశెట్టి కిషన్, ఎర్రం తిరుపతి, తోట తిరుపతి. కార్కూరి చంద్రమౌళి, బొట్ల సత్యనారాయణ, పడాల రామన్న, శ్రీపతివాసు, అమ్జద్‌ఖాన్, రాకేశ్, ఆరె శ్రీనివాస్, బగ్గని రవికుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు నల్ల శంకర్, సురేశ్ బల్దవా, మాదంశెట్టి సత్యనారాయణ, బొలిశెట్టి సునీత, వంగపల్లి అనిత, తదితరులు పాల్గొన్నారు.

**గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం**

దండేపల్లి, నవంబర్6: దండేపల్లి మండలంలోని తాళ్లపేట, కాసిపేట, పామామిడిపెల్లి గ్రామాల్లో మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావుకు మద్దతుగా సోమవారం బీఆర్ఎస్ నాయకులు బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

**లక్షెట్టిపేట 5వ వార్డులో ప్రచారం**

లక్షెట్టిపేట, నవంబర్ 6: పట్టణ మున్సిపాలిటీలోని 5వ వార్డులో మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే అది కేవలం బీఆర్ఎస్ పార్టీకే సాధ్యం అవుతుందన్నారు. గత కాంగ్రెస్ నాయకుల పాలనలో మన తెలంగాణ రైతులు, ప్రజలు పడ్డ కష్టాలు గుర్తు తెచ్చుకుంటే నిద్ర కూడా పట్టదన్నారు. దేశంలో ఎక్కడా లేని మంచి పథకాలు తెచ్చిన మన సీఎం కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే దివాకర్‌రావుకు మద్దతుగా కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు నూనె ప్రవీణ్, షాహెద్ అలీ, మాజీ ఎంపీపీ కట్ల చంద్రయ్య, నాయకులు మెట్టు రాజు, శాంతికుమార్, పెట్టెం తిరుపతి, గరిసె రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

**శ్రీరాంపూర్ అరుణక్కనగర్‌లో ఎమ్మెల్యే ప్రచారం**

శ్రీరాంపూర్, నవంబర్ 6 : తెలంగాణ సాధించుకోవడంతోనే ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు పేర్కొన్నారు. సోమవారం నస్పూర్ ఏరియా అరుణక్కగనర్ 7వ వార్డులో నస్పూర్ చైర్మన్ ఇసంపెల్లి ప్రభాకర్, కౌన్సిలర్ చీడం మహేశ్ ఆధ్వర్యంలో వాడవాడలా ఇంటింటా ఎమ్మెల్యే దివాకర్‌రావు తిరిగి ప్రచరం చేశారు. వాడ వాడల్లో మహిళలు ఎమ్మెల్యేకు హారతులతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ అన్ని వర్గాల అభ్యున్నతికి మ్యానిఫెస్టో రూపొందించారని చెప్పారు. మరింత సంక్షేమ ఫలాలు అందాలంటే కేసీఆర్‌కు మద్దతుగా కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ 50 సంవత్సరాలు పాలించి ఏమీ చేయలేదన్నారు. వారి మాయమాటలు నమ్మవద్దన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే వారిని గెలిపించాలని కోరారు. అరుణక్కనగర్‌లో ప్రతీ ఇంటికీ పట్టాలిచ్చినట్లు గుర్తు చేశారు.

**బీఆర్ఎస్‌లో చేరికలు..**

అరుణక్కనగర్‌కు చెందిన రాంటెంకి ఎల్లయ్య అతని అనుచరులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే దివాకర్‌రావు కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కే సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లెత్తుల రాజేంద్రపాణి, కౌన్సిలుర్లు బేర సత్యనారాయణ, పూదరి కుమార్, నాసర్, వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు కుంభం రాజేశ్వర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు పిల్లి పుష్ప, యూత్ అధ్యక్షుడు శేఖర్, నాయకులు పెట్టం నరేశ్, ఐత రాజు, ఎస్ రమేశ్, బండి తిరుపతి, బోయిన సమ్మయ్య, సిద్ధం తిరుపతి, సుధాకర్‌రెడ్డి, పుప్పాల సత్యనారాయణ, బాపురెడ్డి, అఖిల్, విక్రం తదితరులు పాల్గొన్నారు.

**60 మంది ముస్లిం మైనార్టీల చేరిక**

తెలంగాణా ప్రభుత్వం, కేసీఆర్ ముస్లిం మైనార్టీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని నడిపెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ విజిత్‌రావు, నస్పూర్ మున్సిపల్ చైర్మెన్ ఇసంపెల్లి ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం నస్పూర్ ఏరియా 4వ వార్డు కృష్ణాకాలనీలో కౌన్సిలర్ బెడిక లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో 60 మంది ముస్లిం మైనార్టీలు బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్‌లో చేరిన ఎండీ రహీమొద్దీన్, ఎండీ రజాక్, ఎండీ దావూద్, పులి లచ్చన్న వారి అనుచరులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి నడిపెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు కండువాలు కప్పి స్వాగతం పలికారు. ముస్లింల కోసం షాదీముబారక్ పథకం, రంజాన్ తోఫాలు, మైనార్టీలకు రుణ సాయం, ఇమాంలకు వేతనాలను బీఆర్ఎస్ సర్కారు అందించిందని తెలిపారు. బీఆర్ఎస్‌కు మద్దతుగా కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే దివాకర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పంబాల గంగాఎర్రయ్య, బేర సత్యనారాయణ, నాజర్, మాజీ సర్పంచ్ మల్లెత్తుల రాజేంద్రపాణి, కమలాకర్‌రావు, నాయకులు బండి తిరుపతి పాల్గొన్నారు.



శ్రీరాంపూర్ : బీఆర్ఎస్‌లో చేరిన వారితో విజిత్‌రావు



శ్రీరాంపూర్ : అరుణక్కనగర్‌లో బీఆర్ఎస్‌లో చేరుతున్న కార్మికులు



దండేపల్లి : తాళ్లపేటలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



లక్సెట్టిపేట : 5వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## వైభవంగా దండారీ వేడుకలు



కాకో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

దండేపల్లి, నవంబర్ 6 : దండేపల్లి మండలంలోని గుడిరేవు గోదావరి తీరంలో ఉన్న పద్మల్‌పురి కాకో ఆలయంలో దండారి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం వివిధ ప్రాంతాల నుంచి చేరుకున్న భక్తులు కాకో అమ్మ వారిని దర్శించుకొని పూజలు చేశారు. గోదావరి నదిలో స్నానాలు చేసి గుస్సాడి వేషధారణలో నృత్యాలు చేశారు. ఆలయ ఆవరణలో గానుగ నూనెలో చేసిన పిండి వంటలు అమ్మవారికి నైవేద్యంగా పెట్టారు. గిరిజన మహిళలు గోదావరి జలాలను తీసుకువచ్చి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మేకలు, కోళ్లు బలి ఇచ్చి, ఆలయ ఆవరణలో సామూహిక భోజనాలు ఆరగించారు. దీపావళి పండుగ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి.

## మామిడిపెల్లి యువతికి పీహెచ్‌డీ పట్టా అందజేత




పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న సబిత

దండేపల్లి, నవంబర్6: దండేపల్లి మండలంలోని మామిడిపెల్లికి చెందిన నిరుపేద యువతి గరిగందుల సబిత రసాయన శాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నది. సబిత మామిడిపెల్లి ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి వరకు చదువుకున్నది. ఆ తర్వాత కడెం, 6 నుంచి ఇంటర్ వరకు జవహర్ నవోదయ పాఠశాలలో, డిగ్రీ కాకతీయ యూనివర్సిటీ పాల్వంచలో, పీజీ ఓయూ కోఠి ఉమెన్స్ కళాశాలలో, పీహెచ్‌డీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేసింది. 2019లో గురుకుల డిగ్రీ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించి, ప్రస్తుతం ఆదిలాబాద్ జిల్లాలోని ఇచ్చోడ గురుకుల డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నది. పీహెచ్‌డీ పట్టా పొందడంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## పాఠశాల సందర్శించిన రాష్ట్ర పరిశీలకులు

దండేపల్లి, నవంబర్ 6 : దండేపల్లి మండలంలోని మామిడిపెల్లి ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను ఎఫ్ఎల్ఎన్ రాష్ట్ర పరిశీలకుడు జాయింట్ డైరెక్టర్ ఉషారాణి బృందం సోమవారం సందర్శించారు. పదవ తరగతి విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న లక్ష్య కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం తరగతి గదులు, మధ్యాహ్న భోజన మెనూ, ఉపాధ్యాయుల రికార్డులు, పిల్లల ప్రతిస్పందనను పరిశీలించారు.అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రవీందర్, హెచ్ఎం రాజిరెడ్డి, కవిత, సీఆర్పీ సురేందర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

## జూనియర్ నేషనల్ మీట్‌కు కార్మెల్ విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న సిస్టర్ రిన్సీ

మంచిర్యాల అర్బన్, నవంబర్ 6 : జూనియర్ నేషనల్ అథ్లెటిక్ మీట్‌కు జిల్లా కేంద్రంలోని కార్మెల్ కాన్వెంట్ హై స్కూల్ విద్యార్థిని జీ నాగసాయిశ్రీ ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ రిన్సీ సోమ వారం తెలిపారు. ఈ నెల ఏడవ తేదీ నుంచి పదవ తేదీ వరకు తమిళనాడులో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. నాగసాయిశ్రీని పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ టిస్సీ, సిస్టర్ లిల్లీతో పాటు పీఈటీలు అనిల్, ఫ్రాన్సిస్, చిరంజీవి, శ్రీలత, సిబ్బంది అభినందించారు.

## విద్యార్థులకు మాక్ పోలింగ్

లక్షెట్టిపేట, నవంబర్ 6: పట్టణంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు సోమవారం పాఠశాల యాజమాన్యం మాక్ పోలింగ్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చిందం చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఓటు విలువ తెలియజేందుకు నమూనా బ్యాలెట్ పేపర్‌ను తయారు చేయించి ఓటు వేసే విధానం మాక్ పోలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పేరేంట్ కమిటీ చైర్మన్ రమేశ్ చంద్, డైరెక్టర్ పెట్టెం తిరుపతి, ఎంబడి రమేశ్, ఉపాధ్యాయులు విద్యార్థులున్నారు.